క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి..



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దీక్షితారాణి

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు దీక్షితారాణి, గొలుగువలస వైఎస్సార్‌సీపీ నాయకుడు గులివిందల శంకరరావు అన్నారు. మండలంలోని గొలుగువలసలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షితారాణి రోగులు, గర్భిణులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సాకేటి నాగమణి, పంచాయతీ కార్యదర్శి నరసింహమూర్తి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా వైఎస్సార్‌సీపీ



నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న శంబంగి వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం వద్ద 44 మంది పేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, గోధుమపిండి, వంట నూనె పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అన్వర్ బాషా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ చేపట్టిన ఈ కార్యక్రమంలో నాని, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన



మట్టి నమూనాలపై అవగాహన కల్పిస్తున్న ఎ.డి శ్యామ్‌సుందరరావు

బొబ్బిలి: పొలాల్లో ఏయే పంటలు వేయాలి.. ఎంతమేర పోషకాలు అందించాలి.. అన్న విషయాలపై శనివారం స్థానిక మండల పరిషత్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు మజ్జి శ్యామ్‌సుందరరావు మాట్లాడుతూ, మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయడం వల్ల భూమికి ఏయే పోషకాలు అందించాలో తెలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మట్టి నమూనాల సేకరణపై ఆర్‌బీకే పరిధుల్లోని వ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు.

దాడితల్లికి సౌభాగ్య పూజ



గాజుల అలంకరణలో దాడితల్లి

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి బైపాస్ రహదారిలో ఉన్న దాడితల్లి అమ్మవారికి గాజులు సమర్పించి శనివారం సౌభాగ్య పూజ నిర్వహించారు. అర్చకుడు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి కలశాభిషేకం, సహస్ర నామార్చన, విశేష అర్చనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నాణ్యమైన దిగుబడి



కృష్ణాపురంలో నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

బొబ్బిలి: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయని శిక్షకులు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనీ రమేష్, శంకరరావు, శ్రీరాములు, గ్రామ పెద్దలు సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలి..



విద్యార్థులతో ముచ్చటిస్తున్న న్యాయమూర్తి సరోజనమ్మ

బొబ్బిలి: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండి వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సరోజనమ్మ అన్నారు. శనివారం ఆమె మండలంలోని కలువరాయి బీసీ సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల సౌకర్యాలు, బోధన విషయాలపై ఆరా తీశారు.

జగనన్నా.. నీ రుణం తీర్చుకోలేం..

ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దే అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేమని ప్రజలు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. పుట్టిన బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు అందరికీ అండగా నిలుస్తున్న జగనన్నను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారు. గ్రామాలకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు హారతులతో స్వాగతం పలికి, ఇంటి గోడకు అతికించిన జగనన్న స్టిక్కర్‌ను తనివితీరా చూసుకుని ప్రజానీకం సంబరపడిపోతున్నారు. శనివారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల దృశ్యమాలిక... – బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



బాడంగి: హరిజనపాల్తేరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచారం చేస్తున్న యజ్జల రాజు, కొండలరావు, తదితరులు



బొబ్బిలి: 16వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న కౌన్సిలర్ సవలాపురపు రామకృష్ణ, తదితరులు



తెర్లాం: వెలగవలసలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న మండల జేసీఎస్ కన్వీనర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తదితరులు



రామభద్రపురం: మామిడివలసలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



వంగర: కింజంగి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు



రాజాం: పెనుబాకలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, తదితరులు



సంతకవిటి: సిరిపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు



రేగిడి: కందిశలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: మండలంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యాశాఖపై జరిగిన సమీక్షలో ఉపాధ్యాయుల అక్రమ డెప్యుటేషన్లపై సభ్యులు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావును ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ మాట్లాడుతూ మండలంలో 17 గ్రామాల్లో రూ.35 కోట్లుతో జలజీవన్ మిషన్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. 11 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని అన్నారు. విద్యుత్‌శాఖపై జరిగిన చర్చలో ఏఈ అప్పన్న మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్ ద్వారా మండలంలో 11 గ్రామాలకు కొత్తగా విద్యుత్ స్తంభాలు వచ్చాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు ఇతర శాఖలపై కూడా ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.కాశీవిశ్వేశ్వరరావు, పంచాయతీరాజ్ జేఈ రామకృష్ణ, ఏపీఓ ఎస్.హరనాథరావు, ఏపీఎం టి.మంగమ్మ, తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పంచాయతీల అభివృద్ధి

రాజాం: పంచాయతీ పాలక మండలితో పాటు ప్రజలు సహకారంతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలో నందబలగ గ్రామ సచివాలయం వద్ద శనివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ కొర్ను ఈశ్వరరావుతో పాటు వార్డు మెంబర్లుతో కలిసి పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. గ్రామస్తుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓతో పాటు అన్ని శాఖల అధికారులు పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏసీ చిరంజీవి

రాజాం: మహిళలు స్వయం ఉపాధి వైపు దృష్టిసారించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏసీ చిరంజీవి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య వద్ద మహిళా సంఘాల సభ్యులకు, వారి కుటుంబాలకు చెందిన మహిళలకు ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణను శనివారం పరిశీలించారు. కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుందని, శిక్షణ 90 రోజులు ఉంటుందని అన్నారు. శిక్షణా సమయంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి సర్టిఫికేట్లతో పాటు పీఎంఈజీపై ద్వారా రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు. జిల్లా మహిళా, యువజన ఉపాధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా భారత్ డైనమిక్ లిమిటెడ్ సంస్థ ఈ శిక్షణ ఇస్తుందని అన్నారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ పి.కుమారి, అసిస్టెంట్ ట్రైనీ లాభాన అనూరాధ, ఏపీఎంలు దధికుమార్, హేమలతలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- సెర్ప్ డీపీఎం వీవీఎస్ఎన్ మూర్తి



డైరీఫాం షెడ్‌లు పరిశీలిస్తున్న డీపీఎం మూర్తి, ఏసీ చిరంజీవి తదితరులు

రాజాం: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ఈమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని సెర్ప్ లైవ్‌స్టాక్ డీపీఎం వీవీఎస్ఎన్ మూర్తి, వైకేపీ రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవిలు అన్నారు. మండలంలో కొత్తపేట, బొద్దాం గ్రామాల్లో పీఎంఈజీపీ ద్వారా డైరీఫాం ఏర్పాటుకు రుణం కోసం వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. దరఖాస్తుదారులతో మాట్లాడి యూనిట్ల ఏర్పాట్లకు అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం పొగిరి గ్రామంలో మదర్ పౌల్ట్రీ యూనిట్ స్థల పరిశీలన చేశారు. అనంతరం డీపీఎం మీడియాతో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు 35 శాతం రాయితీ వస్తుందన్నారు. 65 శాతం బ్యాంకు రుణం లభిస్తుందని వివరించారు. పౌల్ట్రీ యూనిట్ ఏర్పాటుకు స్త్రీనిధి నుంచి రుణ సదుపాయం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ఏపీఎం హేమలత, ఏపీఎం దధికుమార్, సీసీలు జ్యోతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భోజనం రుచిగా ఉండాలి

వంగర: పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రుచికరమైన భోజనం వండిపెట్టాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని తలగాం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. జగనన్న గోరుముద్ద పథకం వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తలగాం, ఎం.సీతారాంపురం సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ, ఉద్యోగులు హాజరు, రికార్డుల నిర్వహణ, స్పందన వినతుల పరిష్కారం తదితర అంశాలను పరిశీలించారు.

హద్దురాళ్ల ఏర్పాటు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, ఆడవరం, అక్కన్నఅగ్రహారం, గోపెంపేట గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూముల సర్వే పూర్తయిందని తహసీల్దార్ టి.కల్యాణ్‌చక్రవర్తి తెలిపారు. ఉప్పర్నాయుడువలసలో శనివారం సరిహద్దు రాళ్ల ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఈ నాలుగు గ్రామాల్లో 2500 హద్దురాళ్లు పాతాల్సి ఉండగా 1900 రాళ్లు ఏర్పాటు చేయడం పూర్తయిందన్నారు. దీంతో భూ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. ఆయన వెంట డీటీ డి.శ్రీనివాసరావు, సర్వేయర్ పోలిపల్లి ఉన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్యామ్‌కుమార్

బొబ్బిలి: లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, మార్కెటింగ్ శాఖ ఎ.డి వైవీ శ్యామ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తే బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. ఆయన వెంట బొబ్బిలి పీఏసీఎస్ చైర్మన్ బొమ్మి అప్పలనాయుడు, గృహనిర్మాణ శాఖ సిబ్బంది ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



డొంకినవలస రైల్వేస్టేషన్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఫైర్‌ఆఫీసర్ రామినాయుడు, సిబ్బంది

బాడంగి: మండలంలోని డొంకినవలసతో పాటు డొంకినవలస రైల్వేస్టేషన్ వద్ద అగ్నిమాపక సిబ్బంది శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి.. ప్రమాదాలు జరిగినప్పుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ జి.రామినాయుడు, లీడ్ ఫైర్‌మన్ త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్‌పై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: కార్మికుల పీఎఫ్ డబ్బులు చెల్లించని ఎస్ఎల్ఎస్ జూట్‌మిల్లు యాజమాన్యం కేవీఆర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 2013 నుంచి 752 మంది కార్మికులకు పీఎఫ్ బకాయిలున్నాయన్నారు. వీటి చెల్లింపులు ఆలస్యం చేయడం వల్ల కార్మికులకు రావాల్సిన పెన్షన్ రావడం లేదన్నారు. ఆయన వెంట ఎస్.గోపాలం, పిరిడి రాంబాబు, తదితరులున్నారు.

సకాలంలో బిల్లులు

రాజాం: హౌసింగ్ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలోని గెడ్డవలస గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావుతో కలిసి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

బాడంగి: మండలంలోని ఆరు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు వలంటీర్ పోస్టులకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ బాలమురళీకృష్ణ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. ఏడు పోస్టులకు 21 మంది దరఖాస్తు చేసుకోగా...16 మంది హాజరయ్యారు.

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట పంచాయతీ పరిధి ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టులకు శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ వెంకటరమణతో కలిసి ఎంపీడీఓ రమామణి ఇంటర్వ్యూ నిర్వహించారు.

కలసికట్టుగా పనిచేస్తేనే విజయం..

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేస్తే 2024 ఎన్నికలో విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి బాబ్జీరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చిన్న చిన్న విభేదాలను పక్కనబెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

రెండు రోజుల్లో తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి

తెర్లాం: తెర్లాం పైలెట్ మంచినీటి పథకం ద్వారా గ్రామాల్లో నిలిచిపోయిన తాగునీటి సరఫరాను రెండు రోజుల్లో పునరుద్ధరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదేశించారు. 15 రోజులుగా పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని పలువురు పార్టీ నాయకులు శనివారం తెర్లాం వచ్చిన ఎమ్మెల్యే శంబంగి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీఎంకే రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతూ, వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు బాబ్జీరావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, తదితరులు ఉన్నారు.

రైతులను చైతన్యపరచండి..

- జెడ్పీటీసీ పెద్దింటి రామారావు



భీమవరంలో మట్టి నమూనాల సేకరణపై వీఏఏలకు సూచనలిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకునేలా చైతన్యపరచాలని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు సూచించారు. మండలంలోని భీమవరం ఆర్‌బీకేలో మండలస్థాయి వీఏఏలకు మట్టి నమూనా సేకరణ – పరీక్షలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఏఓ కె. శిరీష ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు రామారావు, గ్రామపెద్ద చప్ప తిరుపతినాయుడు మాట్లాడుతూ, మట్టి నమూనాలు సేకరించడంతో పాటు భూమిలో ఉన్న లోపాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఏఓ శిరీష మాట్లాడుతూ, నేలలోని పోషక లోపాలను గుర్తించి నివారణ చర్యలు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎల్.అప్పలనాయుడు, వై.రాము, ఏఈఓ పుష్పలత, సేంద్రియ వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ సూర్యలక్ష్మి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి..

తెర్లాం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఈఓపీఆర్‌డీ రాంబాబు, పలువురు సర్పంచ్‌లు కోరారు. మండలంలోని తెర్లాం, గొలుగువలస, తదితర పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. తెర్లాంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న ఈఓపీఆర్‌డీ రాంబాబు, సర్పంచ్ రూప మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్, తాగునీరు, కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తున్నామని వివరించారు. గ్రామాలభివృద్ధికి ప్రతిక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు వివరించారు. గ్రామసభల్లో ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ వార్డుసభ్యులు, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.



గొలుగువలస గ్రామసభలో అభివృద్ధి పనులు వివరిస్తున్న పంచాయతీ కార్యదర్శి నరసింహమూర్తి

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగన్‌దే..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పురపాలక పరిధిలోని గొల్లపల్లి 11వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ, నాలుగేళ్ల పరిపాలన అంతా సుభిక్షంగా సాగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంతోషంగా ఉన్నారా అని ఎమ్మెల్యే అడగ్గా..అందరూ ఉన్నామని బదులివ్వడంతో ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ తెర్లి సత్యారావు, మండల జనార్దనరావు, దమ్మా అప్పచ్చి, తుట్ట తిరుపతిరావు, న్యాయవాది రుంకాన ప్రసాదరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని బొద్దూరు గ్రామంలో శనివారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. కోవిడ్ కష్టకాలంలో కూడా పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎన్నడూ నిలుపుదల చేయలేదని, పేదల సంక్షేమంపై సీఎం జగన్ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురం జగన్మోహనరావు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, స్థానిక సర్పంచ్ గేదెల బాబూరావునాయుడు, సర్పంచ్‌లు డోల తిరుపతి, మొయ్యి మోహన్, పి.ఈశ్వరరావు, బి.ప్రసాద్, ఎంపీటీసీ కనగల సన్యాసినాయుడు, వావిలపల్లి రమణ, ఎంపీడీఓ రఘునాధాచారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ప్రారంభం



రీసర్వే కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, తదితరులు

బొబ్బిలి: పట్టణ రెవెన్యూ పరిధిలో జగనన్న శాశ్వత భూ హక్కు – భూరక్ష రీసర్వే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు శనివారం ప్రారంభించారు. భావితరాలకు వివాదాలు లేని ఆస్తిహక్కు కల్పించడమే రీసర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న ఈ సర్వేతో ప్రజలు ఇబ్బందుల్లేకుండా తమ స్థిరాస్తులను భద్రపరుచకోవచ్చన్నారు. వైస్ చైర్మన్ చెలికాని మురళి, కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.